క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



అల్లుకున్న తీగలు తొలగించిన అనంతరం

బోయినపల్లి: మండల కేంద్రం నుంచి వేములవాడ వెళ్లే దారిలో సెస్ కార్యాలయానికి దగ్గరలో ఓ ట్రాన్స్‌ఫార్మర్‌కు తీగజాతి మొక్కలు అల్లుకుని ఉన్నాయని 'ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన సోమవారం వచ్చిన కథనానికి సెస్ అధికారులు స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగజాతి మొక్కలను సోమవారం ఉదయం సెస్ సిబ్బంది తొలగించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు



ఆలయ భూమిని పరిశీలిస్తున్న అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న అనుబంధ ఆలయమైన నాంపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ నాంపల్లి గుట్ట కిందిభాగంలో ఉన్న ఆలయ భూమిలో కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు సమాచారంతో ఆలయ ఏఈవో శ్రీనివాస్ ఆలయ ఇన్‌చార్జి నూగురి నరేందర్ స్థలాన్ని పరిశీలించి అక్రమ నిర్మాణాలను ఆపి సర్వే అనంతరం మాత్రమే నిర్మించాలని తెలిపారు. ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

ఎల్లమ్మతల్లికి పుట్ట బంగారం



పుట్ట బంగారాన్ని స్వీకరిస్తున్న సంఘం సభ్యులు

చందుర్తి: మండలంలోని బండపల్లి గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మతల్లి సిద్దోగంలో రెండో రోజు శ్రీరేణుక ఎల్లమ్మతల్లికి పుట్ట బంగారం తీసుకువచ్చారు. శ్రీరేణుక ఎల్లమ్మ కల్యాణం మంగళవారం జరుగుతుండడంతో సోమవారం పుట్ట బంగారం, బియ్యం సుంకు తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ న్యాత విజయజార్జి, గౌడ సంఘం అధ్యక్షుడు కొండ లక్ష్మన్‌గౌడ్ పాల్గొన్నారు.

చౌడు భూముల్లో సిరుల పంటలు

- ఆధునిక సేద్యంతో అద్భుతాలు
- ప్రత్యామ్నాయ పంటలవైపు అడుగులు
- నూతన ఒరవడి సృష్టిస్తున్న అన్నదాతలు
- డిమాండ్ ఉన్న పంటలపైనే దృష్టి
- 20 గుంటలు.. నెలకు రూ:50 వేల ఆదాయం



రాజన్నపేటలో పందిరిపై సాగు చేసిన బీరకాయలు

నెలకు రూ.50 వేల ఆదాయం



ఫొటోలో ఉన్న రైతు పేరు సుంకూరి శంకర్, మండలంలోని రాజన్నపేటకు చెందిన ఈ రైతు గ్రామంలో ఉపాధి లేక 19 ఏళ్లపాటు గల్ఫ్ దేశాలకు వలస వెళ్లాడు. 2013లో స్వగ్రామానికి వచ్చి ఉన్న ఎకరం భూమిలో సాగును ప్రారంభించాడు. బోరుబావిలో నీరు లేకపోవడంతో కూరగాయల వైపు దృష్టి సారించాడు. 2018లో పందిరి సాగు కోసం భార్య రజిత పేరిట మహిళ సంఘంలో రూ:లక్ష రుణం తీసుకొని 20 గుంటల భూమిలో పందిరి వేయించాడు. తక్కువ నీటిని వినియోగించుకునేలా డ్రిప్ ఏర్పాటు చేసుకొని రూ.5 వేల పెట్టుబడితో కూరగాయలు పండించడం ప్రారంభించాడు. ప్రస్తుతం 20 గుంటల భూమిలో నెలకు రూ:50 వేలు సంపాదిస్తున్నాడు.

ఎల్లారెడ్డిపేట: వినూత్న ఆలోచనలతో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక వనరులను ఉపయోగిస్తూ అద్భుతాలు సృష్టిస్తున్నారు. సంప్రదాయ పంటలపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటలను సాగుచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు, చౌడు భూముల్లోనూ సిరుల పండిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లికి చెందిన వంగల, మహమ్మద్, రాజన్నపేట చెందిన సుంకూరి, పదిరకు చెందిన గుల్లపల్లి జలపతి, నారాయణరెడ్డితో పాటు సుమారు 15 మంది రైతులు ఆధునిక పంటలను సాగుచేస్తూ అధిక దిగుబడులను సాధిస్తున్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని మరికొంతమంది రైతులు ప్రత్యామ్నాయ పంటలపై సాగునీరు ఎక్కువ అవసరం లేకుండా మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను ఎంచుకొని పండిస్తున్నారు. మండలంలోని నలుగురు రైతులను ప్రభుత్వం గుర్తించి, వారిని ప్రశంసాపత్రాలతో సత్కరించింది. వీరి స్ఫూర్తితో మరో 15 మంది రైతులు ఆ బాట ఎంచుకుని లబ్ధి పొందుతున్నారు. ఇదే ఒరవడితో మండలంలో ఈ సీజన్లో చాలామంది వీరిని అనుసరిస్తూ ముందుకుసాగుతున్నారు.

వినూత్నం.. విభిన్నం

కొందరు రైతులు ఆరుతడి పంటలతో అధిక దిగుబడి సాధిస్తున్నారు. పందిరి పంటలుగా కూరగాయలు సాగు, పందిరిపై అలిచింత, చిక్కుడుతోపాటు అంతర్పంటగా టమాట, బెండకాయ, కొత్తిమీర, ఉల్లిపంటలను సాగు చేస్తున్నారు. మండలంలోని ఇప్పటి వరకు 15 మంది రైతులు ఈ పంటలు సాగు చేస్తుంటే వారిని అనుసరించి ఈ సీజన్లో మరో 52 మంది రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసి ముందుకు సాగుతున్నారు. దీంతోపాటు రాచర్ల గొల్లపల్లికి చెందిన మహమ్మద్ ఇబ్రహీం నాలుగు వారాల్లో డ్రమ్‌సీడర్ వెదజల్లే ప్రక్రియ ద్వారా వరి పంటను పండించాడు. గత సీజన్లో విత్తన ఉత్పత్తి ద్వారా సుమారు రెండు లక్షలు ఆదాయం గడించాడు. రాజన్నపేటకు చెందిన సుంకారి శంకర్ 20 గుంటల పొలంలో పందిరి సాగుతో కూరగాయలు పండిస్తూ నెలకు రూ:50 వేలు సంపాదిస్తున్నాడు. రాచర్ల గొల్లపల్లికి చెందిన నరసింహారెడ్డి చిరుధాన్యాలు సాగు చేస్తూ లబ్ధి పొందుతున్నాడు. ఈ రైతులంతా మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలపైనే దృష్టిసారించి లాభాలు ఎలా తీయాలో మిగతా రైతులకు మార్గదర్శకులవుతున్నారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రత్యామ్నాయ పంటల సాగుతో అధిక దిగుబడి సాధించాలని గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. తక్కువ నీటి వాడకం, పెట్టుబడి ఎక్కువ లేకుండా మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను పండించి లబ్ధిపొందాలని సూచిస్తున్నారు. అందుకు కావాల్సిన సహకారం అందిస్తామని కూడా రైతులకు వ్యవసాయశాఖ అధికారులు ప్రోత్సాహమిస్తున్నారు. ఓవైపు ప్రత్యామ్నాయ పంటలు వేసి అధిక లాభాలు గడిస్తున్న రైతులు, మరోవైపు వ్యవసాయాధికారుల ప్రోత్సాహంతో మండలంలో 24 గ్రామాల రైతులు ప్రస్తుతం ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టిసారించారు.



డ్రమ్‌సీడర్‌తో నాటు వేస్తున్న రైతుల

విభిన్నంగా సాగుచేస్తున్నారు



ఆల్లారెడ్డిపేట మండలంలోని 24 గ్రామాల్లో అనేక మంది రైతులు విభిన్న పంటలు సాగుచేస్తున్నారు. పంటల మార్పిడి, నూతన యంత్రాల వా డకం, ఆర్గానిక్ ఫామింగ్‌తో ఆదర్శంగా నిలుస్తున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు మారుతున్నారు. ఆధునిక పద్ధతిలో మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను వేసి లబ్ధి పొందుతున్నారు. ప్రస్తుతం ఈ రైతులను ఆదర్శంగా తీసుకొని ప్రత్యామ్నాయ పంటలపై మిగతా వారికి అవగాహన కల్పిస్తున్నాం.

– చాద భూమిరెడ్డి, వ్యవసాయాధికారి

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడ: వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మివీధి, ఉప్పుగడ్డ, మొదటి బైపాస్, సుభాష్‌నగర్, తిప్పాపూర్, మున్నూరుకాపు సత్రం, అయ్యోర్‌పల్లిలలో మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెస్ ఏఈ సుష్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్లో జాతర ఉత్సవాల పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, సెస్ వినియోగదారులు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

సమాచారం

నేడు మండల సర్వసభ్య సమావేశం

గంభీరావుపేట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీపీ వంగ కరుణ, ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మండలస్థాయి అధికారులు విధిగా ప్రగతి నివేదికలతో హాజరు కావాలని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని వారు కోరారు.

నియామకం

కాంగ్రెస్ గ్రామశాఖ కార్యవర్గం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ గ్రామశాఖ అధ్యక్షుడిగా పొన్నాల తిరుపతిరెడ్డిని నియమించినట్లు దొమ్మటి నర్సయ్య తెలిపారు. పొన్నాల అంజిరెడ్డి, దుర్గం బాలయ్య, జాగిరి అయోధ్య కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు.

జాతిపితకు నివాళి



ఎల్లారెడ్డిపేట: నివాళి అర్పిస్తున్న నాయకులు



చందుర్తిలో..



కోనరావుపేటలో..

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళి అర్పించారు. గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సిద్ధికి గాంధీజీ చేసిన కృషిని మరువలేమన్నారు.

చందుర్తి: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, జెడ్పీటీసీ నాగం కుమార్, గ్రామశాఖ అధ్యక్షుడు దారం చంద్రం, పార్టీ జిల్లా కార్యదర్శి గొట్టే ప్రభాకర్, సోషల్ మీడియా వేములవాడ నియోజకవర్గ కన్వీనర్ బొజ్జ మల్లేశం పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు విక్రుర్తి లక్ష్మీనారాయణ గాంధీజీ చిత్రపటానికి నివాళి అర్పించారు.

కోనరావుపేట: మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల నాయకులు నాగండ్ల భూమేశ్, పెంతల శ్రీనివాస్, సదానందం, లక్ష్మారెడ్డి, అశోక్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ జోడో యాత్ర ముగింపు ఉత్సవాలు



ముస్తాబాద్‌లో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్/గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట: కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు సాగిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ జోడో యాత్ర సోమవారం ముగిసిన సందర్భంగా జాతీయ జెండాతో పాటు పార్టీ జెండాను మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, హమీద్, దొమ్మాటి నర్సయ్య ఆవిష్కరించారు. అనంతరం రాహుల్‌గాంధీ జోడో యాత్ర మూడు వేల కిలోమీటర్లు పూర్తి చేసుకుని కశ్మీర్‌లో ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ 130 రోజులపాటు కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేస్తూ పేదలు, అన్ని వర్గాల ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకున్నారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, కార్యదర్శులు లింగం గౌడ్, గిరిధర్ రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సాహెబ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, పాల్గొన్నారు.

లోవోల్టేజీ పరిష్కారానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు

- సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న సెస్ డైరెక్టర్

చందుర్తి: రైతులను వెంటాడుతున్న విద్యుత్ లోవోల్టేజీ సమస్యను అధిగమించేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు అన్నారు. మండలం రామన్నపేట గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను జెడ్పీటీసీ నాగం కుమార్‌తో సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ దుమ్ము అంజయ్య, రుద్రంగి ఏఎంసీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, రుద్రంగి ఏఎంసీ డైరెక్టర్ పోతురాజు నగేశ్, సింగిల్‌విండో డైరెక్టర్ గుడిసె రమేశ్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఎల్లారెడ్డిపేట: మండలం హరిదాస్‌నగర్ గ్రామంలోని మొకరాళ్ల వద్ద సోమవారం సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కొరకు సహకరించిన మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఏఈ దివ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ కొండ రమేశ్‌గౌడ్, అందె సుభాష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం



నేరెళ్లలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వైద్యాధికారి స్రవంతి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా కుష్ఠు వ్యాధి నిర్మూలనకు సోమవారం ప్రతిజ్ఞ చేశారు. ఆమె మాట్లాడుతూ జనవరి 30 నుంచి జనవరి 13 వరకు కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. తుమ్ములు, దగ్గు ద్వారా వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. వ్యాధి లక్షణాలు 3 నుంచి 5 ఏళ్లలో బయటపడవచ్చన్నారు. ఎలాంటి లక్షణాలున్నా వైద్యసిబ్బందిని సంప్రదించి చికిత్సలు పొందాలని కోరారు. డాక్టర్ బాబు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎమ్‌లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరెళ్లలో..

తంగళ్లపల్లి: మండలంలోని నేరెళ్ల గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం మెడికల్ ఆఫీసర్ రేఖ ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధి గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రేఖ మాట్లాడుతూ శరీరం స్పర్శ కోల్పోవడం, మచ్చలు ఏర్పడడం లాంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బొబ్బల మంజుల, ఎంపీటీసీ మీసాల కళ, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మైనార్టీ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

సిరిసిల్లకల్చరల్: వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న మైనార్టీ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ రూపొందించిన క్యాలెండర్‌ను కలెక్టర్ అనురాగ్ జయంతి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎండీ షానవాజ్, ఎండీ షఫియొద్దిన్, అహ్మద్ అబ్దుల్ రసూల్, ఎండీ మహామూద్ అలీ, షేక్ నిసాద్ అహ్మద్, ఎండీ అయూబ్ ఖాన్, కమాల్ అహ్మద్, పర్వేజ్ నిజాం, మీర్జా ఫసహత్ అలీబేగ్, ఎంఎ రహ్మాన్, ఎండీ సలీం, నిసార్, ఎజాస్ ఖాన్ పాల్గొన్నారు.

జాతీయ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



మౌనం పాటిస్తున్న అధ్యాపకులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం జాతీయ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.బి.రాజగోపాల్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సముపార్జనలో అసువులు బాసిన వీరులందరినీ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. అధ్యాపకులు ప్రభాకరాచారి, సంధ్యవాణి, రాములు, రవీందర్, శ్రీహర్ష, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో అర్హులకు ప్లాట్లు ఇవ్వాలి

ముస్తాబాద్: ముస్తాబాద్ ఇందిరమ్మ కాలనీలో అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని మాజీ సర్పంచ్ ఓరగంటి తిరుపతి తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ కాలనీలో కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన స్థలాలను ఇతరులు కబ్జా చేశారని కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన పట్టాలకు స్థలాలు చూపాలన్నారు. ఎంతోమంది ఇళ్లు లేని పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచితంగా స్థలాలను అందించిందని, అలాగే నిర్మాణాలకు రుణాలు ఇచ్చిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం పేరుతో పేద ప్రజలను వంచిస్తోందన్నారు. ఈమేరకు అధికారులు ఇచ్చిన పట్టా కాపీలతో వినతిపత్రం అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కోనరావుపేట: జోడో యాత్ర క్యాలెండర్‌ను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొట్టె రుక్మిణి, నాయకులు రాస రవీందర్‌రెడ్డి, కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, పెంతల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ ఇంటి స్థలాన్ని కేటాయించాలి



మాట్లాడుతున్న రమేశ్

సిరిసిల్లటౌన్: డబుల్ బెడ్రూం ఇళ్ల డ్రాలో ఇల్లు రాని నిరుపేదలందరికీ ప్రభుత్వం స్థలాన్ని కేటాయించి ఇంటిని నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బివైనగర్‌లోని సిపిఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సర్వే చేసి 3000మందిని గుర్తించి కేవలం 1800 మందిని మాత్రమే ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇండ్లు లేని వారికి ఇంటి స్థలంతో పాటు రూ. 5లక్షలు కేటాయించాలన్నారు. లేని యెడల ఫిబ్రవరి 6 నుండి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరహార దీక్షలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోడం రమణ, సూరం పద్మ, జిల్లా నాయకులు రాజశేఖర్, దేవదాస్, పోచమల్లు తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

సోదర భావంతో మెలగాలి

రుద్రంగి: కుల, మత భేదాలను విడిచి ప్రజలందరూ సోదరభావంతో మెలగాలని రుద్రంగి డిప్యూటీ తహసీల్దార్ మల్లయ్య కోరారు. మండలంలోని సర్పంచ్ తండా గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమణయ్య, ఏఈవో విజయ్, సీఆర్‌పీ శ్రీవాణి, రాజు, ఏపీఎం, ఐకేపీ సెర్ప్, పంచాయితీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

2 నుంచి బీరయ్య కామరాతి ఉత్సవాలు

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో ఫిబ్రవరి 2 నుంచి 10 వరకు బీరయ్య కామరాతి ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. పోచమ్మ బోనాలతో ప్రారంభమయ్యే ఉత్సవాలక తరలిరావాలని శ్రీకృష్ణయాదవ సంఘం బాధ్యులు కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

రుద్రంగి: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మండల కేంద్రానికి చెందిన నేవూరి నర్సయ్య సోమవారం రుద్రంగి లయన్స్ క్లబ్ వారు రూ.12 వేలు నగదు, క్వింటాలు సన్న బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు తీపిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, మంచె రాజేశం, కొమిరె శంకర్; కర్ణవత్తుల దేవేందర్, గోడికార్ హిరోజీ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ముస్తాబాద్: మండలం తెర్లుమద్ది, బందనకల్, వెంకట్రావుపల్లె, చిప్పలపల్లి, మోహినికుంట, గోపాల్‌పల్లె, మద్దికుంట గ్రామాల్లో కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ పేద, బడుగు, బలహీన వర్గాల ఇళ్లలో బాలికలు ఆత్మగౌరవంతో జీవించేలా కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచులు కిషన్‌రావు, లక్ష్మణ్, వనజ, జ్యోతి, నరేశ్, మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, సురేందర్‌రావు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు టీ షర్టులు..

వీర్నపల్లి: మండలంలో ఈటీసీఏ (ఎమిరేట్స్ తెలగాణ కల్చరల్ అసోసియేషన్) అధ్యక్షుడు, రాధారపు సత్యం, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతో కలిసి సోమవారం వీర్నపల్లి ఆటో యూనియన్‌లోని 63 మంది సభ్యులకు ఒక్కొక్కరికీ రెండు టీ షర్టులు చొప్పున వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాటి దినకర్,ఎంపిటిసి అరుణ్ కుమార్, ఉప సర్పంచ్ రవి, నాయకులు రాజ్ కుమార్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ఎంపీడీవోకు సత్కారం

ముస్తాబాద్: జిల్లాలో ఉత్తమ ఎంపీడీవోగా అవార్డు పొందిన ముస్తాబాద్ ఎంపీడీవో రమాదేవిని మొర్రాయిపల్లె సర్పంచ్ సడిమెల సుజాత, ఉపసర్పంచ్ మెంగని శ్రీనివాస్‌లు సోమవారం సన్మానించారు.

విలాసాగర్‌లో మెగా రక్తదాన శిబిరం

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం క్రితిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

వేములవాడరూరల్: 9, 10 తరగతులకు పండిత్ వ్యాయామం బోధిస్తున్న ఉపాధ్యాయులకు వెంటనే పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయులు సోమవారం డిమాండ్ చేశారు. వేములవాడ రూరల్ మండలం వట్టెంల జెడ్పీహెచ్ఎస్‌లో తెలుగు పండితులు హెచ్ఎం సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభలో సీఎం తెలుగు, హిందీ, పండిత పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తానని మాట ఇచ్చారన్నారు. సంవత్సరాలు గడిచినా అమలు చేయకపోవడంతో నిరాశతో ఉన్నామని, ఇక నుంచి 9, 10 తరగతులు బోధించమని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కార్యక్రమంలో జనపాల వెంకటయ్య, స్వరూపారాణి, మంద శ్రీనివాస్ గోనె బాల్‌రెడ్డి, వేణుమాధవ్ పాల్గొన్నారు.

పరామర్శ

కోనరావుపేట: ఇటీవల మృతిచెందిన మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కాయితి సత్తయ్య కుటుంబ సభ్యులను ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి సోమవారం పరామర్శించారు.